క్లుప్తంగా

కొనుగోళ్ల ఆలస్యంతో రైతులకు నష్టం



మాట్లాడుతున్న తాళ్లపల్లి సంపత్ గౌడ్

మానకొండూర్: ప్రభుత్వం ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతోనే, అకాల వర్షాలకు రైతుల నష్టపోయారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించిన 20 రోజులైన కొనుగోళ్లు చేపట్ట లేదని మండిపడ్డారు. ధాన్యం అన్నిరకాలుగా బాగున్న రెండు కిలోలు అదనంగా తూకం పెడుతూ మోసగిస్తున్నారని తడిసిన ధాన్యం పేరుతో ఇంకా ఎంత కోత విధిస్తారోనని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎకరాకు రూ. పదివేల పరిహారం ఎక్కడ అందజేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి జిల్లా నాయకులు సాయిరి దేవయ్య, రామిడి తిరుపతి, చలిగంటి సంపత్, గసిగంటి సంపత్, మీసా సత్యనారాయణ, చిరంజీవి, శ్రీనివాసు, మర్రి ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం



కంటిపరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీదేవి

ఇల్లందకుంట: మండలంలోని భోగంపాడు గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ జిల్లెల తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ ఎక్కటి సంజీవ రెడ్డి బుధవారం ప్రారంభించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కంటివెలుగు పథకం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, 18 సంవత్సరాలు నిండిన వారందరూ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి తులసిదాస్, క్యాంపు ఇన్‌చార్జి డా. శ్రీదేవి, పీహెచ్ఎన్ శ్యామల, ఆప్తాలమిస్ట్ రాజు, డీఈవో రవికిరణ్, కార్యదర్శి అంకూస్, కారోబారు రా జు,ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రిడ్జిపై గుంత పూడ్చివేత



మట్టి పోస్తున్న గ్రామస్తులు

రామడుగు: మండల కేంద్రం సమీపంలోని మోతె వాగు పాత బ్రిడ్జిపై ఏర్పడిన భారీ గుంతను గ్రామస్తులు బుధవారం పూడ్చివేశారు. కొత్త బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వడ్లూరి రాజేందర్‌చారి, నాయకులు తిరుపతి, అంజి, కుమార్, శ్రీకాంత్, రామ్, లక్ష్మణ్, శ్రీను, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

దుకాణదారులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలి



తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

చొప్పదండి: పట్టణంలోని దుకాణదారులు ట్రేడ్ లైసన్సులు తప్పకుండా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ కోరారు. చొప్పదండిలోని దుకాణాల లైసెన్స్‌లను బుధవారం మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 31వ తేదీలోపు ప్రతి దుకాణదారుడు ట్రేడ్ లైసన్స్ పొందాలని, లేని పక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెంట మున్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారంపై స్పష్టత ఏదీ..?

- అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలు
- ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక
- రైతుల వారీగా పంట నష్టం సర్వే చేస్తే మేలంటున్న నాయకులు

హుజూరాబాద్‌రూరల్: గతంలో ఎన్నడూ లేని విధంగా యాసంగిలో వరితో పాటు ఇతర పంటలు సాగు చేసిన అన్నదాతలు కంటతడిపెడుతున్నారు. మండల వ్యాప్తంగా 22, 200 ఎకరాల్లో వరి సాగు చేశారు. 3,946 మంది రైతులకు చెందిన 3,788 ఎకరాల్లో వరి, 62 మంది రైతులకు చెందిన 67 ఎకరాల్లో మొక్కజొన్న మొత్తం 3,855 ఎకరాల్లో పంటలు ధ్వంసమయ్యాయని వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. అనంతరం రైతువారీగా సమగ్ర సర్వే చేపట్టాల్సి ఉంటుంది. దీని ఆధారంగానే రైతులకు పరిహారం అందించనున్నారు. కానీ సర్వే ఎప్పుడు పూర్తవుతుందో.. డబ్బులు రైతుల ఖాతాల్లో జమయ్యేదెప్పుడో అనే దానిపై స్పష్టత కనిపించడం లేదు.

క్షేత్ర స్థాయిలో పర్యటన

అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలపై వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమిక సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదించారు. రైతు వారీగా క్షేత్ర స్థాయి సర్వే చేపట్టి పంట నష్టంపై సమగ్ర సర్వే చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు అనుగుణంగా వ్యవసాయశాఖాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సర్వే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పక్కాగా సర్వే చేపట్టి వివరాలు నమోదు చేస్తేనే పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందనుంది. ఆ దిశగా కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం వ్యవసాయశాఖపై ఉంది.

ప్రజాప్రతినిధులు స్పందిస్తేనే...

ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాలు తెలియజేస్తున్నాయి. కోతకు వచ్చిన వరి గింజలు పూర్తిగా నేలరాలాయి. బాధిత రైతులు ప్రభుత్వం నుంచి పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తేనే కొంతవరకు సాయం అందే అవకాశం ఉందని రైతు సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.



రాంపూర్ గ్రామంలో దెబ్బతిన్న పంటలను సర్వే చేస్తున్న వ్యవసాయాధికారులు

అకాల వర్షాలు ముంచాయి



ఆరెకరాల్లో వరి సాగుచేశాను. ఇటీవల కురిసిన వర్షాలకు పంట మొత్తం ధ్వంసమైంది. అకాల వర్షం నిండా ముంచింది. దీనికి తోడు తడిసిన ధాన్యం ఎండటం లేదు. ఏం చేయాలో పాలుపోవడం లేదు. ధాన్యం మొలకెత్తుతోంది. ఈసారి సాగు పెట్టుబడి పెరిగింది.

– బుజ్జా సంపత్ రెడ్డి, రైతు,తోకలపల్లి

చేసిన కష్టం వర్షంపాలు



ఎకరన్నర భూమిలో వరి సాగుచేస్తే అకాల వర్షాలు దెబ్బతీశాయి. ధ్వంసమైన పంటలు చూస్తే ఏడుపొస్తోంది. చిన్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావాలి. చేసిన కష్టం నీళ్ల పాలైంది. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి.

– పంజాల తిరుపతమ్మ, మహిళా రైతు, కనుకులగిద్దె

సర్వే చేపడుతున్నాం



ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో సర్వే చేపడుతున్నాం. పంట నష్టం వివరాలను ఏఈవోలతో నమోదు చేయిస్తున్నాం. రైతుల బ్యాంకు ఖాతా నంబరు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతోపాటు సెల్‌నంబర్ సేకరించి వివరాలు నమోదు చేయాలని నిర్దేశించాం.

– సునీల్‌కుమార్, మండల వ్యవసాయాధికారి, హుజూరాబాద్



అ'పూర్వ' సమ్మేళనం

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల 1991-92 పదో తరగతి విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముప్పై ఏళ్ల తర్వాత ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈసందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులు వెంకటయ్య, జైసింగ్, మాధవరెడ్డి, రామభద్రం, వెంకటయ్య, చంద్రయ్య, మసూరుద్దీన్, నరహరిని ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నడికొండ తిరుపతిరెడ్డి, అందె పోచయ్య, ఎడవెల్లి విజయ, గునుకుల రవీందర్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతా వారోత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, రైతులు

తిమ్మాపూర్: విద్యుత్ భద్రతా వారోత్సవాలు 2023లో భాగంగా మండలంలోని అల్గునూర్ ట్రాన్స్ కో పరిధిలోని గ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిధులతో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కరీంనగర్ రూరల్ డివిజనల్ ఇంజినీర్ తిరుపతి, అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్ శ్రీనివాస్, అలుగునూర్ ఏఈ వెంకటరమణ, సిబ్బంది విద్యుత్ భద్రత, పొదుపుపై సూచనలు చేశారు. వర్షాకాలంలో వ్యవసాయ పొలాల్లో విద్యుత్ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సెల్ ఫోన్ చార్జింగ్ పెట్టి మాట్లాడడం ద్వారా ప్రమాదం జరిగే అవకాశం ఉందని, ఇళ్లలో జీఐ వైర్లతో దండాలు కట్టడం ద్వారా ప్రమాదం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అనంతరం అవగాహన సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ సర్పంచ్ నీలమ్మ, రైతులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

సంతోషిమాతా దేవాలయం దశమ వార్షికోత్సవం



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

జమ్మికుంట: పట్టణంలోని కొండూర్ కాంప్లెక్స్‌లో గల శ్రీసంతోషిమాతా దేవాలయం దశమ వార్షికోత్సవాలు ఆలయ ప్రధానకార్యదర్శి చందారాజు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రతన్‌శర్మ, వసంతశర్మ వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు, అమ్మవారికి నవ విధ అభిషేకాలు, చండీయాగం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గర్రెపల్లి రాజమౌళి, అయిత మహేష్, యాద సతీష్, యుగేందర్, వీరలింగం, యాంసాని సంపత్, మురళి పాల్గొన్నారు.



గన్నేరువరం: భూమిపూజలో ప్రజాప్రతినిధులు, తదితరులు

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి గ్రామంలో శ్రీ భక్తమార్కండేయ ఆలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అటికం శారద, ఎంపీటీసీ అటికం రాజేశంగౌడ్, పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు గుంటుక లింగయ్య, సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామంలో బుధవారం గౌడ కులస్తుల ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాలు నిర్వహించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతంరెడ్డి, గౌడ సంఘం అధ్యక్షుడు కుమారస్వామి, మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.



గన్నేరువరం: మానసాదేవిని దర్శించుకుంటున్న శరత్‌రావు, మల్లారెడ్డి, తదితరులు

మానసాదేవి వార్షికోత్సవం

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామం శ్రీమానసాదేవి ఆలయ పంచమ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం శ్రీరాజశ్యామల మహా యాగం ఆలయ ప్రధాన అర్చకులు మామిడాల నాగసాయిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. బెజ్జంకి, నుస్తులాపూర్ సహకార సంఘాల చైర్మన్లు తన్నీరు శరత్‌రావు, అలువాల కోటి, గన్నేరువరం ఎంపీపీ లింగాల మల్లారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ గౌరవ అధ్యక్షుడు బద్దం నర్సింహారెడ్డి, చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి వారిని సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బద్దం తిరుపతిరెడ్డి, ఉపసర్పంచ్ బద్దం సంపత్‌రెడ్డి, సింగిరెడ్డి లచ్చిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

మిల్లర్ల కోతలు.. కొర్రీలు



మిల్లు ఎదుట ధాన్యం బస్తాల లోడ్‌తో ట్రాక్టర్

- తరుగు పేరిట క్వింటాల్‌కు 10 కిలోల దోపిడీ
- అధికారుల పర్యవేక్షణ కరువు

జమ్మికుంట: అకాల వర్షాలకు తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ఆదేశాలు ఇస్తున్నా మిల్లుల యాజమానులు లాభాపేక్షతో కోతలు పెడుతున్నారు. అటు వర్షంతో నష్టం, ఇటు నాణ్యత పేరుతో మిల్లర్లు కటింగ్ చేస్తున్నారు. మిల్లుల్లో రైతులు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. కింద స్థాయి అధికారులు, కేంద్రం నిర్వాహకులు రైతులను దోపిడీ చేస్తున్న సంఘటనలు వెలికి వస్తున్నా పట్టించుకోవడం లేదు. అధికారులకు రైతులు ఫోన్ చేసిన తీయడం లేదు. పరోక్షంగా మిల్లుల యాజమానులకు సహకరించే పరిస్థితి నెలకొంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు అకాల వర్షాలకు ధ్వంసమయ్యాయి. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కొనుగోళ్లు కింది స్థాయిలో సజావు సాగడం లేదు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరువ తీసుకొని న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

తాలు, నూక అంటూ నిరాకరిస్తున్నారు



ఈ ఫొటోలోని వ్యక్తి పేరు సయ్యద్ సమీర్, బిజిగిరిషరీఫ్ గ్రామం. ఆరు ఎకరాల్లో 1010 రకం వరిసాగు చేశాను. 400 బస్తాల ధాన్యం నాగంపేటలోని కొనుగోలు కేంద్రంలో అమ్మకానికి తీసుకువచ్చాను. కేంద్రం నిర్వాహకులు 16 మ్యాచర్ రావడంతో ట్రాక్ సీట్ రాసి ఇచ్చి పట్టణంలోని ఓ రైస్ మిల్లుకు తరలించాలని సూచించారు. మిల్లుకు వచ్చిన తర్వాత ధాన్యం చూసి 40 కిలోల బస్తాకు నాలుగు కిలోల చొప్పున క్వింటాల్‌కు 10 కిలోల కటింగ్ ఉంటుందని అంటున్నాడు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ఇక్కడికి పంపారని తెలిపినా తాలు, నూక అవుతుందంటూ తీసుకోవడానికి నిరాకరించారు. ఆందోళన చెందుతుండగా నిర్వాహకులు సర్ది చెప్పడంతో అన్‌లోడ్ చేసుకున్నారు. ఇది ఈఒక్క రైతు పరిస్థితి కాదు, మండలంలోని రైతులందరిది.

పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న చంద్రమోహన్

రామడుగు: పోస్టల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్‌శాఖ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ కోరారు. మండల కేంద్రంలోని పోస్టల్‌శాఖ కార్యాలయంలో బుధవారం మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి భారత ప్రభుత్వం పథకం తీసుకువచ్చిందని, రూ.వెయ్యి నుంచి రూ.రెండు లక్షల వరకు డిపాజిట్ చేసుకోవచ్చని, డిపాజిట్‌పై రూ.7.5 శాతం వడ్డీ అందించడం జరుగుతుందన్నారు. పథకంపై విస్తృత ప్రచారం చేయాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో రామడుగు, కొత్తపల్లి, గంగాధర ఎస్పీఎంలు, రహమత్, ప్రవీణ్ కుమార్, మహేశ్, దాది మల్లేశం, శేఖర్, మారుతి సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ సభకు తరలిరండి



మహిళకు బొట్టుపెడుతున్న ఎంపీపీ వినీత

చిగురుమామిడి: హుస్నాబాద్‌లో 5న నిర్వహించే మంత్రి కేటీఆర్ బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎంపీపీ కొత్త వినీత కోరారు. బుధవారం పార్టీ నాయకులతో కలిసి చిగురుమామిడిలో ఇంటింటికీ తిరుగుతూ మహిళలకు బొట్టుపెడుతూ బహిరంగ సభకు రావాలని ఆహ్వానించారు. చిగురుమామిడి మండలం నుంచి పదివేల మందిని తరలిస్తున్నామని చెప్పారు. గ్రామాలకు ఇన్‌చార్జీలను నియమించామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజయ్య, ప్యాక్స్ చైర్మన్ వెంకట్రమణారెడ్డి, సర్పంచ్ లక్ష్మణ్, గ్రామశాఖ అధ్యక్షుడు శివప్రసాద్, మహిళా నాయకులు భవాని, అరుణ, సావిత్రి, రాంబాబు, ముక్కెర సదానందం, శ్రీకాంత్, సర్వర్‌పాషా, సంజీవ్, సంపత్‌కుమార్, నరేశ్, అరవింద్, బాలరాజు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

హుజూరాబాద్: పట్టణంలోని ఆర్టీసీ డిపో కార్యాలయ ఆవరణలో బుధవారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటి డీఎంహెచ్‌వో డాక్టర్ చందు ఆకస్మాతుగా గుండెపోటు వస్తే కండక్టర్లు, డ్రైవర్లు సీపీఆర్ చేసి కాపాడే విధానం గురించి వివరించారు. ఈకార్యక్రమంలో డీపో మేనేజర్ అర్పిత, సూపర్‌వైజర్లు మురళీ, వీరారెడ్డి, సారయ్య తదితరులుఉన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలి

తిమ్మాపూర్: మారుతున్న కాలానికి అనుగుణంగా యువత సాంకేతికతను అందిపుచ్చుకోవాలని పొరండ్ల సర్పంచ్ రెడ్డిత్రివేణి అన్నారు. గ్రామంలో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పే పాల్ ప్రాజెక్ట్ కంప్యూటర్ ల్యాబ్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పే పాల్ ప్రాజెక్టులో భాగంగా మన గ్రామం డిజిటల్ విలేజ్‌లో ఎంపికవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా గ్రామంలోని యువతకి, పెద్దలకు కంప్యూటర్ నేర్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ గ్రామంలో నూతనంగా ప్రారంభించిన మినీ కంప్యూటర్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకుని కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. త్వరలోనే ప్రాజెక్టుకు సంబంధించిన డిజిటల్ విలేజ్ ప్రాడక్ట్ క్యాలెండర్‌ను ప్రభుత్వ అనుమతితో విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఎస్‌సీ నిర్వాహకులు కీసర వెంకటేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ రెడ్డి త్రివేణి

మహిళ ప్రాణాలు కాపాడిన పోలీసులు

- రైలు కిందపడి ఆత్మహత్యకు యత్నం
- బ్లూకోల్ట్స్ పోలీసులను అభినందించిన సీఐ రమేశ్

జమ్మికుంట: కుటుంబ కలహాలతో ఓ వివాహిత రైలు కిందపడి అత్మహత్యకు యత్నించింది. సమాచారం తెలుసుకున్న బ్లూకోల్ట్స్ సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి చాకచక్యంగా మహిళను కాపాడి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టణ సీఐ రమేశ్ భార్యభర్తలకు కౌన్సెలింగ్ నిర్వహించి సమస్యను పరిష్కరించి ఇంటికి పంపించారు. పోలీసులు స్పందించిన తీరుపై పలువురు అభినందించారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బిజిగిరిషరీఫ్‌కు చెందిన పుప్పాల శ్రీలత, రాజమొగిలి భార్యభర్తలు, వీరికి ఇద్దరు సంతానం. శ్రీలత గృహిణి కాగా భర్త కార్పెంటర్‌గా పని చేస్తుంటాడు. వీరు కొంతకాలం క్రితం హన్మకొండలో ఉపాధినిమిత్తం వలస వెళ్లారు. రాజమొగిలి వరంగల్‌లో కార్పెంటర్ పనిచేస్తున్నాడు. ఈ మధ్యకాలంలో భార్యభర్తల మధ్య కుటుంబ కలహాలు తలెత్తాయి. దీంతో హన్మకొండ నుంచి స్వగ్రామమైన బిజిగిరిషరీఫ్‌కు వచ్చారు. కాగా రాజమొగిలి ప్రతీరోజు హన్మకొండకు పనినిమిత్తం వెళ్లి వస్తున్నాడు. మంగళవారం రాత్రి భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రీలత బిజిగిరిషరీఫ్ రైల్వేస్టేషన్‌కు వెళ్లి ఆగి ఉన్న గూడ్స్ రైలుకింద పట్టాలపై కూర్చుంది. స్థానికులు గమనించి, బయటకు రావాలని కోరినప్పటికీ వినలేదు. దీంతో 100 ఫోన్‌చేసి జమ్మికుంట సీఐ రమేశ్‌కు సమాచారం అందించారు. సీఐ హుటాహుటిన బ్లూకోల్ట్స్ సిబ్బందిని అప్రమత్తం చేసి, ఘటన స్థలానికి పంపించారు. రైల్ సిగ్నల్ ఇవ్వకుండా రైల్వే స్టేషన్ మేనేజర్‌కు సమాచారం అందించి, వారి సహకారంతో శ్రీలత వద్దకు సమస్యను పరిష్కరిస్తామని నచ్చజెప్పి శ్రీలతను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల సమక్షంలో భార్యభర్తలిద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చి, ఇంటికి పంపించారు. అనంతరం బ్లూకోల్ట్స్ సిబ్బందిని సీఐ రమేశ్ అభినందించారు.



కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

చికిత్స పొందుతూ మృతి

చొప్పదండి: పట్టణానికి చెందిన విశ్రాంత ఏఎస్సై లింగయ్య (68) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసుల తెలిపిన వివరాలు.. లింగయ్య మంగళవారం రాత్రి రోడ్డుపై వెళ్తుండగా ధర్మారం నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న టాటా ఏస్ ఆటో ఢీకొంది. గాయపడిన లింగయ్యను స్థానికులు 108 వాహనంలో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందాడని కుమారుడి ఫిర్యాదు మేరకు వాహనాన్ని అజాగ్రత్తగా నడిపిన కరీంనగర్‌కు చెందిన డ్రైవర్ అఫ్జల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.